క్లుప్తంగా

అభినందనలు


ప్రోత్సాహక బహుమతులతో విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం స్థానిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు అభినందనలు తెలియజేశారు. మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన వారిలో గిడుతూరి గాయత్రి మంగ (587), నీలాపు లోహిత (567), తోరా హాసిని (556) ఉన్నారు. వీరికి ముఖ్య అతిథి కర్రోతు సత్యం ప్రోత్సహక బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతికి సర్వం సిద్ధం


అన్నమయ్య జయంతి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: రింగ్‌రోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి అన్నమయ్య జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఎమ్. భీష్మారావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్యాలయం ఆవరణలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆశీస్సులతో అన్నమయ్య సంకీర్తనామృతం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు సత్కారం


గర్భిణులతో నిర్వాహకులు

బొబ్బిలి: మాతృ దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం నిర్వహించారు. బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి అక్కయ్య చేతుల మీదుగా కాబోయే మాతృమూర్తులకు దుశ్శాలువలు, రవిక, గాజులు, పూలు, స్వీట్ బాక్సులతో సత్కరించి మాతృత్వ గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జె.వి జయలక్ష్మి పాల్గొని మాతృత్వానికి దగ్గరగా ఉన్న మహిళలంతా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై వివరాలందజేశారు. మెడిటేషన్‌తో ప్రశాంతమయిన మాతృత్వాన్ని పొందే అవకాశాలను రాజేశ్వరి అక్కయ్య వివరించారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం


పోరాం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై పోరాం గ్రామంలో యువకులు, గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యంతో పాటు బెట్టింగ్‌లు, జూదం వంటి వాటి జోలికి వెళ్లవద్దని చెప్పారు. చెడు వ్యసనాలతో ఆరోగ్యంతో పాటు జీవితాలు ఛిద్రమవుతాయని అన్నారు.

ఇటుకకు తగ్గిన డిమాండ్

రేగిడి: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా గృహాలు మంజూరు చేయకపోవడంతో పాటు ఎక్కడా కొత్తగా ప్రభుత్వ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ఇటుకకు డిమాండ్ బాగా తగ్గిందని తయారీ దారులు అంటున్నారు. మండలంలోని చిన్నశిర్లాం, లచ్చన్న వలస, లచ్చారాయపురం తదితర గ్రామాల్లో ఎక్కువగా ఇటుక బట్టీలు నిర్వహిస్తుంటారు. మండలంలో పదుల సంఖ్యలో కుటుంబాలు ఇటుక తయారీని వృత్తిగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నాయి. గత కొంత కాలంగా ఇటుక అమ్ముడుకావడం లేదని, తమ జీవనాధారం కోల్పోతున్నామని ఇటుక తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల కాలంలో ఎలక్ట్రికల్ వాహనాల కొనుగోళ్లకు పెరుగుతున్న ఆదరణ
- ఇంధన ఖర్చు ఆదాతో పాటు పర్యావరణానికి మేలు
- మూడు గంటల చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల వరకు ప్రయాణం
- రూ. 60 వేల నుంచి అందుబాటులో వాహనాలు


షోరూమ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌లు

ఈ బైక్‌కు క్రేజీ..!

విజయనగరం: పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు ఉన్నప్పటికీ చాలా మంది ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇంధనం, నిర్వహణ ఖర్చు ఆదా చేసుకునే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఈ – వాహనాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో రోజువారీ కార్యకలాపాల కోసం 20 నుంచి 30 కిలోమీటర్ల ప్రయాణించే వారందరూ ఇప్పుడు ఈ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో చిన్న పట్టణాల్లో సైతం ఈ – వాహనాలు విక్రయించే షోరూమ్‌లు వెలుస్తున్నాయి. సుమారు పదికి పైగా కంపెనీలు ఈ – వాహనాలు తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం విజయనగరంలో రూ.60 వేల నుంచి లక్ష రూపాయల మధ్య వివిధ రకాల ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు చార్జింగ్ పెడితే, ఆయా వాహనాల సామర్థ్యాన్ని బట్టి 60 నుంచి 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. ఇటీవల కాలంలో గ్రామీణులు సైతం వీటిపై మక్కువ చూపుతున్నారు. దీంతో జిల్లా కేంద్రమైన విజయనగరంలో వివిధ కంపెనీలకు చెందిన 10కి పైగా షోరూమ్‌లు వెలిశాయి. సాధారణంగా ఇంటి నుంచి ఆఫీసుకి వెళ్లి రావడం.. పిల్లలను స్కూల్లో దింపి, సాయంత్రం తీసుకురావడానికి.. పొలానికి వెళ్లి వచ్చేందుకు ఈ-వాహనాలు అనువుగా ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో ప్రయాణం

పెట్రోల్‌తో నడిచే వాహనం కొనాలంటే ఇప్పుడు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. అయినా ఇవి లీటర్ పెట్రోల్‌కు సుమారు 50 కిలోమీటర్లు మాత్రమే మైలేజ్ ఇస్తున్నాయి. అంటే ఒక్కో కిలోమీటరుకు రూ. 2.25 నుంచి రూ.2.50 వరకు ఖర్చవుతోంది. అదే ఈ – వాహనం అయితే కిలోమీటర్‌కు 15 నుంచి 20 పైసల లోపు ఖర్చవుతుంది. పైగా ఈ – వాహనాలకు మరమ్మతులు తక్కువ.

మహిళలకు సౌకర్యవంతంగా

ఉపాధి కోసం నగరంలో బ్లౌజింగ్ సెంటర్ నిర్వహిస్తున్నా. గత ఆగస్టులో ఎలక్ట్రికల్ బైక్ కొనుగోలు చేశా. కరెంట్ బిల్లు నెలకు రూ. 300కు మించి రావడం లేదు. ఒకసారి చార్జింగ్ పెడితే 70 నుంచి 80 కిలోమీటర్ల వరకు రేంజ్ వస్తోంది. దీంతో మూడు రోజుల పాటు రాకపోకలు సాగిస్తాను. మహిళలకు ఈ వాహనాలు సౌకర్యవంతంగా ఉంటాయి.

– నందిని, గృహిణి, విజయనగరం

జాగ్రత్తలు తప్పనిసరి..

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. వాహనం చార్జింగ్ చేసే సమయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూసుకోవాలి. అదేవిధంగా వాహనంలోని బ్యాటరీ తరచూ వేడెక్కుతుంటే తక్షణమే మెకానిక్ చూపించాలి. లేనిపక్షంలో బ్యాటరీ మార్పు చేసుకోవాలి.

– శ్రీను, మెకానిక్, విజయనగరం.

మరీ ఇంత అధ్వానమా..!


కలుషితమైన పెద్ద చెరువు

విజయనగరం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ వాకింగ్ ట్రాక్ (పెద్దచెరువు) అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో కళకళలాడిన పెద్ద చెరువు నేడు వెలవెలబోతోంది. పరిసర ప్రాంతాల వారు వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులను చెరువుతో పాటు వాకింగ్ ట్రాక్‌పై వేస్తున్నారు. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. ట్రాక్ మొత్తం చెత్తా, చెదారంతో నిండిపోవడంతో వాకింగ్ చేసేందుకు వీల్లేకుండా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువును అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్‌ను మరింత మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


అధ్వానంగా వాకింగ్ ట్రాక్


చెరువులో గుర్రపు డెక్క


పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు


ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

రేపటి నుంచి పైడితల్లి పండగ

- సుమారు 120 ఏళ్ల తర్వాత వేడుకలు
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు


పైడితల్లి


పైడితల్లి ఆలయం

డెంకాడ: గ్రామాల్లో గ్రామ దేవత పండగలను సాధారణంగా మూడు, ఐదు సంవత్సరాలకు.. లేదంటే పది, ఇరవై సంవత్సరాలకు ఒకసారైనా చేస్తుంటారు. కాని మండలంలోని అక్కివరం గ్రామంలో పైడితల్లి పండగ సుమారు 120 సంవత్సరాల తర్వాత చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జరిగిన పండగను చూసిన ఒక్కరు కూడా గ్రామంలో లేరంటే పండుగ ఎప్పుడు చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. అయితే పండగను మాత్రం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి సిరిమాను చెట్టును సేకరించి సిరిమానుగా మలుస్తున్న పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 12న తొలేళ్లు, 13న సిరిమానోత్సవం, 14న కనుమ పండుగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి


కమిషనర్ తారక్‌నాథ్‌కి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాల వరకు పొడిగించాలన్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్, మరణించిన, రిటైర్ అయిన, అనారోగ్యంతో ఉన్న కార్మికుల బిడ్డలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 20న.. స్థానిక సమస్యలపై 21, 22 తేదీల్లో సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయిూస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు కమిషనర్‌కి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహనరావు, యూనియన్ నాయకులు బాబూరావు, రాము, దుర్గారావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలు అలవర్చాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులకు సంస్కృతీ, సంప్రదాయాలను చిన్నతనం నుంచే అలవాటు చేయాలని సామాజికవేత్త, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక గురజాడ స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వాగ్దేవీ సమారాధం, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి జూన్ 23 వరకు కోట ఎదురుగా ఆల్ఫా స్కాన్స్ పక్కన ఉన్న వెంకటరమణ డిగ్రీ కళాశాల ఆవరణలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలపైన సనాతన ధర్మంపైన, భగవద్గీత, నాట్యశాస్త్రంలలో శిక్షణ ఇస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ఉచిత శిక్షణకు పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జి.ఎరుకునాయుడు, డాక్టర్ జక్కు రామకృష్ణ, మంజుల పారుపూడి, గురజాడ ఇందిర పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి

పూసపాటిరేగ: విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేయాలని ముక్తిదాం క్షేత్రం ట్రస్టీ పోతినిండి అనంతబాబు అన్నారు. వారం రోజులుగా గోవిందపురం ముక్తిదాం క్షేత్రంలో జ్ఞాన వికాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పరివార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధ్యాత్మికతపై కనీసం అవగాహన ఉండాలన్నారు. యోగా, సూర్య నమస్కారాలు, భగవద్గీత శ్లోకాలు పఠించడం, సంప్రదాయ విలువలు నేర్చుకోవం, డ్రాయింగ్, క్రాఫ్ట్ మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోతినిండి శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ విక్రం జగన్నాథం, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులచే పాదపూజ..


కొండవెలగాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పాద పూజ చేస్తున్న చిన్నారులు

నెల్లిమర్ల రూరల్: మదర్స్ డేను పురస్కరించుకుని మండలంలోని సారిపల్లి, కొండవెలగాడ ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న తల్లులను కేంద్రాలకు రప్పించి చిన్నారులచే పాదపూజ చేయించారు. అమ్మతనం కన్నా కమ్మనైనది ఈ సృష్టిలో ఏదీ లేదని.. అమ్మను అందరూ దైవంగా ఆరాధించి పూజించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన టికెట్ ధర

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రం నుంచి ధర్మవరం మీదుగా ఎస్.కోట వెళ్లే రూట్‌లో టిక్కెట్ ధర తగ్గిస్తున్నామని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూట్‌లో ఇంతవరకు తొమ్మిది స్టేజీలుండగా.. వాటిని ఎనిమిదికి తగ్గించి రూ.55 ఉన్న టికెట్ ధరను 50 రూపాయలు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

- కిశోర బాలికలకు ఈ నెల 2 నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక సదస్సులు
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సూచనలు సలహాలు


వెంపడాం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం (ఫైల్)

పూసపాటిరేగ: కిశోర బాలికలతోనే సమాజ వికాసం సాధ్యమవుతుంది. అటువంటి కిశోర బాలికల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాల సమన్వయంతో సదస్సులు నిర్వహిస్తున్నాయి. 11వ సంవత్సరం నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఆయా ప్రాంతాల పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక సదస్సులు నిర్వహించి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోర బాలికలకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగవివక్షత నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బాలికల అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలను కూడా వివరిస్తున్నారు. గ్రామ మహిళా పోలీస్ కన్వీనర్‌గా, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా కార్యకర్త, ఎంఎల్‌పీఎచ్‌ఓ, వీఓఏలు కమిటీ సభ్యులుగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో 272 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 62 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల పరిధిలో 975 మంది గర్భిణులు, 750 మంది బాలింతలు, ఆరు నెలల్లోపు చిన్నారులు 775 మంది, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులు 2350 మంది.. మూడు నుంచి ఆరు సంవత్సరాలోపున్న చిన్నారులు 1855 మంది ఉన్నారు. 272 అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమై విద్యే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నప్పటికీ సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పౌష్టికాహారం అందజేస్తున్నాం..

కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నాం. వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సూచనలు, సలహాలు ఇస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం ఐసీడీఎస్ సెక్టార్ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– కె. లక్ష్మి, కార్యకర్త , పేరాపురం అంగన్‌వాడీ కేంద్రం

అవగాహన కల్పిస్తున్నారు..

ఈ నెల రెండో తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ, వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

– టి. సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ